ఏడుగురు విద్యార్థులపై బహిష్కరణ వేటు

- మూడు నెలలు అకాడమిక్ ఇయర్, హాస్టల్ సస్పెన్స్
- యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం వైద్య విద్యార్థి మనోహర్‌పై ర్యాగింగ్ పేరుతో విచక్షణరహితంగా దాడి చేసిన ఘటనలో ఏడుగురు సీనియర్ వైద్య విద్యార్థులపై సస్పెన్షన్ వేటు పడింది. కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దివ్వెల మోహన్దాస్ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన యాంటీ ర్యాగింగ్ కమిటీ 4 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించి ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్ వైద్య విద్యార్థుల నుంచి వివరణ తీసుకొని సాక్షులను విచారించారు. ర్యాగింగ్ జరిగింది వాస్తవమేనని నిర్ధారించింది. మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న మనోహర్ ఈ నెల 14న రాత్రి కళాశాల లైబ్రరీలో చదువుకొని వెళు న్న క్రమంలో సీనియర్ వైద్య విద్యార్థులు పిలిచినా రాకపోవడంతో ర్యాగింగ్ పేరుతో విచక్షణా రహితంగా అతనిపై దాడి చేశారు. గాయపడిన విద్యార్థి పోలీసులను ఆశ్రయించడంతో సీనియర్ వైద్య విద్యార్థులపై కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో నాలుగు రోజులపాటు విచారణను కొనసాగించిన కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ మంగళవారం సమావేశమై మనోహర్‌పై దాడి చేసిన సీనియర్ వైద్య విద్యార్థులు అభినవ్ మోర, సిలువేరు శ్రీహరి, శ్రీ చరణ్, సూర్య ప్రకాష్, సాయి కిరణ్, హరికృష్ణ, కె.లోకేష్‌ను ఈ విద్యా సంవత్సరంలో మూడు నెలల పాటు బహిష్కరించడంతోపాటు ఏడాది పాటు హాస్టల్ నుంచి బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకుంది. యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశంలో డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి, యాదగిరి, వేణుగోపాల్, కిషన్, విజయ్ కుమార్, సుధాకర్, అనితారెడ్డి, అనిఫ్ ఖాన్, సుజాత, రాజారామ్, దామోదర్ బాయ్, అపర్ణ, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

దమ్మున్న దర్శకుడు కోదండరామి రెడ్డి

- కేంద్ర పూర్వ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి

ప్రజాశక్తి కల్చరల్

తన దర్శకత్వం వహించిన సినిమాలు ఎన్ని విజయం సాధించినా నిరాడంబరత, స్వచ్ఛత కల కోదండరామి రెడ్డి దమ్మున్న దర్శకుడు అని కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ టి సుబ్బిరామిరెడ్డి. ప్రశంసించారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ అమెరికా గాయని శారద ఆకునూరిల నిర్వహణలో ఎ కిడంసరామి రెడ్డి సినీ జీవిత స్వర్ణ వుట్సవ వేడుక వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా సుబ్బిరామి రెడ్డి పాల్గొని కోదండ రామ రెడ్డిని సత్కరించి మాట్లాడారు. సినీ రంగంలో మహా మహా దర్శకులు ఎందరో వున్నారని కానీ వారి విజయవంత కాలం తక్కువేనని ఏ దర్శకుని వరుస విజయాలు వుందన్నారు.కానీ కోదండరామి రెడ్డి దర్శకత్వం వహించిన 90 సినిమాలలో 90 శాతం విజయవంతం ఇనాయని వివరించారు. అక్కినేని నాగేశ్వరరావు ను గుర్తు చేసుకుంటూ ఆయనతో స్నేహం అరవై సంవత్సరాని ఆయన పోయినా నాకు తరచూ కలలో వస్తారని గుర్తుచేసుకున్నారు. అధ్యక్షత వహించిన దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ చిరంజీవికి పలు హిట్ చిత్రాలను ఇచ్చిన దర్శకుడు కోదండరామి రెడ్డి అనీ ఆయన చిత్రాలలో పాటలు మనస్సుకు హత్తుకొంటాయని తెలిపారు.పలువురు దర్శకులు బి.గోపాల్, రాసి నరసింహారావు, గోపాల రెడ్డి,నటులు శుభలేఖ సుధాకర్, రోజా రమణి, కిమ్స్ బొల్లినేని కష్ణయ్య, ఎన్.అర్.ఐ లు రవి కొండబోలు, ప్రసాద్ తోటకూర, మురళి వెన్నాం తదితరులు శాలువాలతో కోదండ రాము రెడ్డిని సత్కరించారు. వంశీ రామ రాజు స్వాగతం పలికిన కార్యక్రమానికు తొలుత శారద బృందం పాడిన కోదండ రాము రెడ్డి చిత్రాల పాటలకు నేపథ్యం కోదంరామిరెడ్డి వివరించటం ప్రేక్షకులను ఆసక్తి రేపింది.

ప్రభుత్వం బలహీన కులాల అభివృద్ధికి సహకరిస్తోంది : మంత్రి దయాకర్‌రావు

ప్రజాశక్తి - కల్చరల్

తెలంగాణ ప్రభుత్వం అన్ని కులాలకు మతాలకు సముచిత స్థానం కల్పించి అందరికి సమాన అవకాశాలుకల్పిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుడగ జంగాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మహాసభ రవీంద్రభారతిలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూబుడగ జంగాల హక్కులను గుర్తించి వారిని ఉన్నతి కి కషి చేస్తున్నది ముఖ్య మంత్రి కెసిఆర్ అని, అందరూ మరోసారి బిఆర్ఎస్ పార్టీని గెలిపించాన్నారు. బుడగ జంగాలను కాపాడుకునే బాధ్యత తమదేనన్నారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఎక్సైజ్ పర్యటన శాఖ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బుడగ జంగాల జనాభా ప్రతిపదికన చట్టసభల్లో అవకాశం కల్పించే విధంగా రాష్ట్ర ముఖ్య మంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎస్సి ఉపకులాల్లో రాష్ట్రంలో బేడ బుడ్గ జంగాలు వెనకబడిఉన్నారని తెలిపారు. ఐక్య మత్యంతో హక్కులను సాధించుకోవాలన్నారు.

ద్వేషం కాదు... దేశం ముఖ్యం

- దేశమంటే రాష్ట్రాల సమాహారం
- తెలంగాణపై ప్రధాని వ్యాఖ్యలను ఖండించిన కెటిఆర్
- ఆయన అహంకారానికి, అజ్ఞానానికి నిదర్శనమని ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ద్వేషం కాదు...దేశం ముఖ్యం. దేశమంటే రాష్ట్రాల సమాహారమని మంత్రి కెటిఆర్ తెలిపారు. తెలంగాణపై ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ మేరకు మంగళవారం ట్వీట్ చేశారు. ఏ పార్లమెంటు సాక్షిగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారో, అదే పార్లమెంటు సాక్షిగా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పట్ల ప్రధాని పదే పదే అక్కసును వెళ్లగక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది మంది ప్రజల మనోభావాలతో ముడిపడిన చారిత్రక అంశాల పట్ల సున్నితంగా వ్యవహరించడం నేర్చుకోవాలని ప్రధానికి సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత

సంబరాలు జరగలేదనడం...ప్రధాని అహంకారానికి, అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు.

రాష్ట్రం ఏర్పడిన నాడు ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అంబరాన్నంటిన సంబరాలు కంటి కనబడలేదా? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే ఉద్దేశంతో కోట్లాది మంది ప్రజల మనోభావాలని గాయపరిచేలా గతంలోనూ తల్లిని చంపి బిడ్డను తీశారని మోడీ వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. గాంధేయ మార్గంలో కొనసాగిన తెలంగాణ ఉద్యమంలో రక్తపాతం జరిగిందని అనడం అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి నిధుల మూటలివ్వడం లేదు.. కనీసం మాటల్లోనైనా మర్యాద చూపించాలని సూచించారు.

ఏడు మండలాలను లాక్కొని లోయర్ సీలేరు ప్రాజెక్టులో కలుపుకుని తొలి ద్రోహం చేశారని మండిపడ్డారు. నిటిఅయోగ్ సూచించిన మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలకు బిజెపి సర్కార్ నిధులివ్వడానికి నిరాకరించిందని గుర్తుచేశారు. క్రిష్ణా నదీ జలాల వాటా తేల్చకుండా పదేళ్లుగా దక్షిణ తెలంగాణ రైతులను దగా చేస్తున్నారని తెలిపారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని గుజరాత్‌కు తరలించుకుపోయారని, 157 మెడికల్ కాలేజీల్లో తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదని, అప్పర్ భద్ర, పోలవరంకు జాతీయ హోదా ఇచ్చి మధ్యలో తెలంగాణకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఎపి విభజన హామీలనూ నెరవేర్చలేదని తెలిపారు. డబుల్ ఇంజిన్ నినాదంతో ఊదరగొట్టిన డబుల్ డిజిట్ సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. డిపాజిట్లు పోగొట్టుకోవడంలో బిజెపి మళ్లీ సెంచరీ కొట్టడం పక్కా అని తెలిపారు. తెలంగాణ పుట్టుకనే అవమానించిన బిజెపికి పుట్టగతులుండవని విమర్శించారు.

ఆస్పత్రి బిల్లు కట్టలేక బిడ్డను వదిలేసిన తల్లిదండ్రులు

- కాంచనబాగ్ ఒవైసి ఆస్పత్రిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆస్పత్రిలో బిల్లు కట్టే ఆర్థికస్తోమత లేక ఆ తల్లిదండ్రులు పసికందును వదిలేసి వెళ్లారు. ఈ సంఘటన హైదరాబాద్ పిసల్‌బండలోని ఒవైసి ఆస్పత్రిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కె.నితిన్- ప్రవళ్లిక ఏడాది కిందట కులాంతర వివాహం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని సైదాబాద్ సింగరేణి కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి 13 రోజుల కిందట కూతురు జన్మించింది. చిన్నారికి ఊపిరి తిత్తుల్లో సమస్య ఉండడంతో స్థానిక డాక్టర్‌ను సంప్రదించారు. డాక్టర్ వెంటనే పెద్దాస్పత్రికి వెళ్లాలని సూచించారు. దాంతో వారు పిసల్‌బండలోని ఒవైసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు చిన్నారిని ఆస్పత్రిలో చేర్చుకొని చికిత్స అందిస్తున్నారు. చిన్నారి ఆరోగ్యం మెరుగుపడింది. కానీ రూ.లక్ష 16 వేల బిల్లు కట్టి చిన్నారిని తీసుకెళ్లాలని ఆస్పత్రి నిర్వాహకు లు చెప్పారు. తల్లిదండ్రులు రూ.35 వేలు చెల్లించారు. మిగతా డబ్బుల కోసం ప్రయత్నించారు. నగదు సర్దుబాటు కాకపోవడం తో దిక్కుతోచని స్థితిలో మంగళవారం పసికందును ఆస్పత్రిలోనే వదిలేసి వెళ్లిపో యారు. రాత్రి వరకు తిరిగి రాలేదు.

జియో ఎయిర్‌ఫైబర్ వచ్చేసింది..!

హైదరాబాద్ : రిలయన్స్ జియో కొత్తగా వైర్‌లెస్ ఇంటర్నెట్ సర్వీస్ ఎయిర్‌ఫైబర్‌ను విడుదల చేసింది. దీన్ని దేశంలో హైదరాబాద్ సహా 8 నగరాల్లో తొలుత అందుబాటులోకి తెచ్చినట్లు ఆ కంపెనీ మంగళవారం వెల్లడించింది. ఆరు ప్లాన్లతో అందిస్తోన్నట్లు పేర్కొంది. దీని నెలవారి రుసుంల శ్రేణీని రూ.599 నుంచి రూ.3,999గా నిర్ణయించింది. హైఎండ్ ప్లాన్‌లో వినియోగదారులు గరిష్టంగా 1జిబిపిఎస్ వేగంతో ఇంటర్నెట్‌ను పొందవచ్చని పేర్కొంది. దీంతో 550 కంటే ఎక్కువ డిజిటల్ టివి ఛానెల్‌లను, 16 ఒటిటిలను యాప్‌లను అందిస్తున్నట్లు తెలిపింది. ప్రారంభ ప్లాన్ రూ.599లో 30 ఎంబిపిఎస్ వేగంతో డేటాను పొందవచ్చని, అన్ని ప్లాన్లు కూడా ఏడాది వ్యవధితో లభిస్తాయ, 12 నెలల ప్లాన్లపై ఇన్‌స్టాలేషన్ ఛార్జీలు ఉండవని పేర్కొంది. లేదంటే ఇన్‌స్టాలేషన్ కోసం రూ.1,000 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.

'క్యూ మార్ట్' స్టోర్ ప్రారంభం

హైదరాబాద్ : సూపర్ మార్కెట్ చెయిన్ 'క్యూ మార్ట్' నగరంలో తన మూడో స్టోర్‌ను మాదాపూర్‌లోని సత్య నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసింది. దీనిని స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంఎ అండ్ యుడి అరవింద్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ స్టోర్ చుట్టుపక్కల ఉన్న వాళ్ళందరికీ ఎంతగానో ఉపయోగ పడుతుందని అరవింద్ కుమార్ తెలిపారు. నాణ్యమైన వస్తువులు సరసమైన ధరలకు అందించి వినియోగదారుల ఆదరాభిమానాలు చూరగొనాలని ఆయన సూచించారు. వినియోగదారుల రిటైల్ అనుభవాన్ని మరోసారి పునర్నిర్వచించటానికి సిద్ధంగా ఉన్నామని క్యూ మార్ట్ ఎండి బివికె రాజు పేర్కొన్నారు.

కాంగ్రెస్ మాటలు సంతకం లేని డెబిట్ చెక్కు

- ఆ పార్టీ అధికారంలోకొస్తే ఆరు నెలలకో సిఎం
- మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు సంతకం లేని డెబిట్ చెక్కులాంటివని, అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని, వారి మాటలను ఎవ్వరూ నమ్మే పరిస్థితిలో లేరని వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేటలో రూ.564 లక్షలతో నిర్మించిన 96 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంగళవారం ఆయన ప్రారంభించి లబ్దిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి పేరు ఢిల్లీ నుంచి రావాల్సి వస్తుందని, అందుకే ఆరు నెలలకో సిఎం మారతారన్నారు. అలాగే, ఆరు నెలలకోసారి కర్ఫ్యూ, ఆరు గంటల కరెంటు మాత్రమే ఉంటుందని తెలిపారు. పరిశ్రమలకు వారంలో రెండు రోజులు పవర్ హాలిడే ఉంటుందన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉందని అక్కడ కేవలం రూ.600 పింఛన్ మాత్రమే ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని వర్గాల ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకుల మోసపూరిత మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో

లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేస్తున్న హరీశ్‌రావు

చేయని అభివృద్ధి పనులను తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో కాలిపోయిన మోటార్లు పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేవన్నారు. కాళేశ్వరం నీటిని పెద్ద శంకరంపేట మండలంలోని ప్రతి రైతుకు ప్రతి ఎకరానికి అందిస్తామని హామీ ఇచ్చారు. సబ్ మార్కెట్ యార్డ్‌ను ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయం మేరకు నూతన పూర్తిస్థాయి మార్కెట్ యార్డుగా తొందరలో ప్రకటిస్తామన్నారు. బిఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో త్వరలో వస్తుందని, చాలా అద్భుతంగా ఉంటుందన్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో అన్ని కేసులు, కొట్లాటలే తప్ప అభివృద్ధి ఏమాత్రం జరగలేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత నారాయణఖేడ్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, నియోజకవర్గంలో ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మూడవసారి గెలిపించాలని కోరారు.

నేటి నుంచి డిఎస్‌సి దరఖాస్తుల స్వీకరణ

- సమర్పణకు తుదిగడువు అక్టోబర్ 20
- నవంబర్ 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు
- జిల్లాలు, సబ్జెక్టులు, రోస్టర్ వారీగా పోస్టుల వివరాలు

ప్రజాశక్త - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో 2,598 పోస్టులు మహిళలకే కేటాయించబడ్డాయి. మిగిలిన 2,491 పోస్టులు జనరల్ కేటగిరీతోపాటు రిజర్వేషన్లకు అభ్యర్థులకు ఉన్నాయి. జనరల్ కేటగిరీలో ఉండే పోస్టులకు మహిళలు పోటీపడే అవకాశం ఉంది. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డిఎస్‌సి) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ ఈ నెల 8న విడుదల చేసిన విషయం తెలిసిందే. జిల్లాలు, పోస్టులు, కేటగిరీలు, సబ్జెక్టు, మాధ్యమం, రోస్టర్ వారీగా పూర్తి వివరాలను విద్యాశాఖ మంగళవారం ప్రకటించింది. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ డిఎస్‌సి నోటిఫికేషన్‌ను గురువారం జారీ చేసింది. 1,739 స్కూల్ అసిస్టెంట్, 611 లాంగ్వేజ్ పండితులు, 164 వ్యాయామ ఉపాధ్యాయులు (పిఇటి), 2,575 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి) కలిపి మొత్తం 5,089 పోస్టులు ఉన్నాయి.

అత్యధికంగా హైదరాబాద్‌లో 358 పోస్టులు, అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో 43 పోస్టులు భర్తీ అవుతున్నాయి. ఎస్‌జిటి పోస్టులకు డిఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులే అర్హులుగా ఉంటారని స్పష్టం చేసింది. బుధవారం నుంచి ఉపాధ్యాయ పోస్టుల కోసం దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. వాటి సమర్పణకు వచ్చే నెల 20వ తేదీ వరకు తుదిగడువు ఉంది. మొదటిసారిగా డిఎస్‌సి రాతపరీక్షలను నవంబర్ 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష (సీబీఆర్టీ) విధానంలో నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల గరిష్ట వయోపరిమితి 44 ఏండ్లు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేండ్లు సడలింపు ఉంటుంది. వికలాంగులకు పదేండ్లు సడలింపు ఉంటుంది. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ, సంగారెడ్డిలో పరీక్షలను నిర్వహిస్తారు. ఇతర వివరాలకు www.schooledu.telangana.gov.in అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

నేటి నుంచి ఎడ్‌సెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్, డిపిఇడి, బిపిఇడి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పిఇసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఎడ్‌సెట్ ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, పరిశీలన, ఫీజు చెల్లింపునకు సంబంధించిన వివరాలను బుధవారం నుంచి ఈ నెల 30వ తేదీలోగా నమోదు చేయాలి. ధ్రువపత్రాల పరిశీలనకు స్కాన్ చేసిన వాటిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఎన్‌సిసి, సిఎపి, వికలాంగులు, క్రీడల అభ్యర్థులకు సంబంధించి భౌతికంగా ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తారు. వచ్చే నెల మూడు నుంచి ఐదు వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలి. ఆరున వెబ్ ఆప్షన్ల సవరణకు అవకాశముంటుంది. తొమ్మిదిన మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. వచ్చే నెల పది నుంచి 13వ తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలి. వచ్చే నెల 30న బిఎడ్ అభ్యర్థులకు తరగతులు ప్రారంభమవుతాయి. పిఇసెట్ ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 20 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, పరిశీలన, ఫీజు చెల్లింపు వివరాలు అందుబాటులో ఉంటాయి. 24, 25 తేదీల్లో ఎన్‌సిసి, సిఎపి, వికలాంగులు, క్రీడల అభ్యర్థులకు భౌతికంగా ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. 28, 29 తేదీల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలి. 30న ఆప్షన్ల సవరణకు అవకాశముంటుంది. వచ్చేనెల మూడున మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు పొందిన అభ్యర్థులు నాలుగు నుంచి ఏడు వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలి. వచ్చేనెల 30 నుంచి డిపిఇడి, బిపిఇడి తరగతులు ప్రారంభమవుతాయి.

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
I.A.No.448/2019 A.S.No.98/2019
A.S.No.98/2019

Between:
N.Prakasha Reddy Died by Lrs in Prahaladha Reddy. ...Pititioner/Appellant
And
1.N.Sreenivasulu
2.N.Harinath. ...Respondents /Respondents

Notice to Respondent No.2

R2: N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.

పై నెంబరు అప్పీలులో 2వ రెస్పాండెంట్ అయిన అయిన మీ హాజరు నిమిత్తం 22-09-2023 వ తేది ఉదయం 10.30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
I.A.No.447/2019 A.S.No.97/2019
A.S.No.97/2019

Between:
N.Sapthagiri Reddy. ...Pititioner/Appellant
And
1.N.Sreenivasulu
2.N.Harinath. ...Respondents /Respondents

Notice to Respondent No.2

R2: N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.

పై నెంబరు అప్పీలులో 2వ రెస్పాండెంట్ అయిన అయిన మీ హాజరు నిమిత్తం 22-09-2023 వ తేది ఉదయం 10.30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
I.A.No.446/2019 A.S.No.96/2019
A.S.No.96/2019

Between:
N.Ramana nanda Reddy ...Pititioner/Appellant
And
1.N.Sreenivasulu
2.N.Harinath. ...Respondents /Respondents

Notice to Respondent No.2

R2: N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.

పై నెంబరు అప్పీలులో 2వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తం 22-09-2023 వ తేది ఉదయం 10.30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
I.A.No.451/2019 A.S.No.100/2019
A.S.No.100/2019

Between:
N.Yerrappa Reddy ...Pititioner/Appellant
And
1.N.Sreenivasulu
2.N.Harinath. ...Respondents /Respondents

Notice to Respondent No.2

R2: N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.

పై నెంబరు అప్పీలులో 2వ రెస్పాండెంట్ అయిన అయిన మీ హాజరు నిమిత్తం 22-09-2023 వ తేది ఉదయం 10.30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

In the Court of the IVth Addl. District Judge: Anantapuramu
I.A.No.449/2019 A.S.No.101/2019
A.S.No.101/2019

Between:
N.Sapthagiri Reddy. ...Pititioner/Appellant
And
1.N.Sreenivasulu
2.N.Harinath. ...Respondents /Respondents

Notice to Respondent No.2

R2: N.Harinath S/o Late Munirathnam, Residing at H.No.10-2-421, West Maredupalli, Secunderabad.

పై నెంబరు అప్పీలులో 2వ రెస్పాండెంట్ అయిన అయిన మీ హాజరు నిమిత్తం 22-09-2023 వ తేది ఉదయం 10.30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

K.Lakshman Char, K.Chandra Sekhar Rao
Advocates
Ananthapuramu

అంగన్‌వాడీలపై నిర్బంధాన్ని ఆపాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని వెంటనే ఆపేయాలని కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వారిని పర్మినెంట్ చేయాలనీ, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంపు, తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, అంగన్‌వాడీ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యన్.కరుణకుమారి అధ్యక్షతన కార్మిక, ఉద్యోగ సంఘాల నేతృత్వంలో రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ నెల 24న జిల్లా కేంద్రాల్లో కార్మిక, ఉద్యోగ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్టు, 26న ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టనున్నట్టు ప్రకటించారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బి.విజయ్‌కుమార్ యాదవ్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎల్.పద్మ, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌కే బోస్, బిఇఎఫ్ఐ అధ్యక్షులు సతీస్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కృష్ణ, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర నాయకులు ప్రేమ్‌పావని, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్‌రావు పాల్గొన్నారు. అంగన్‌వాడీల పట్ల అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఏకీకృత సిద్ధాంతం దేశానికి ప్రమాదం

- ఆదివాసీ గిరిజన హక్కులకు భంగం
- ఐక్య ఉద్యమాలతోనే వెనక్కి కొట్టగలం
- ఆర్మ్ జాతీయ నాలుగో జాతీయ మహాసభలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి ప్రభుత్వం ఏకీకృత సిద్ధాంతాన్ని గిరిజనులపై బలవంతంగా రుద్దుతున్నదని కేరళ పరిశ్రమల శాఖ మంత్రి పి రాజీవ్ ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడులోని నమక్కల్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్) జాతీయ నాలుగో మహాసభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆర్మ్ జాతీయ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మిడియం బాబురావు సంఘం జెండాను ఆవిష్కరించారు. తమిళనాడులోని వివిధ గిరిజన ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన అమరవీరుల జ్యోతిని బృందాకారత్, బాబురావు, జతిన్ చౌదరిలకు అందజేశారు. అనంతరం రాజీవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా తరతరాలుగా గిరిజనులు అనుసరిస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు కనుమరగయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను కాలరాసే విధంగా నూతన చట్టాలను కేంద్రం తీసుకొస్తున్నదని విమర్శించారు. అడవులు, అటవీ సంపదను అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్లకు కట్టబెడుతూ అటవీ సంరక్షణ నియమాల చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. కామన్ సివిల్ కోడ్ పేరుతో వివిధ తెగలు, జాతులు, మతాల ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఇది అత్యంత ప్రమాద కరమనీ, దీనికి వ్యతిరేకంగా ఐక్యఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు. అందుకనుగుణంగా మహాసభల్లో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. బాబురావు మాట్లాడుతూ మణిపూర్ హింసకు బిజెపియే బాధ్యత వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని విమర్శించారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా గిరిజన తెగలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహాసభలో సంఘం జాతీయ కన్వీనర్ జతిన్ చౌదరి, బృందాకారత్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, దళిత సోషల్ ముక్తి మంచ్ జాతీయ నాయకులు సామ్యేల్‌రాజ్, ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుమతి, మాజీ ఎంపీ పులిన్ బస్కి, త్రిపుర మాజీ మంత్రి జమాతియ, తెలంగాణ టీజీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్,ఏటీజీఎస్ ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, తొడసం బీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

DECCAN POLYPACKS LIMITED
Regd. Office: Plot No. A-40, Road No. 7, IDA Kukatpally, Hyderabad-37, Telangana, Ph : 040-23077224, (CIN: L24134TG1984PLC005215)

NOTICE OF THE 39th ANNUAL GENERAL MEETING, AND REMOTE E-VOTING INFORMATION.

Notice is hereby given that the 39th Annual General Meeting (AGM) of the shareholders of Deccan Polypacks Limited will be held on Friday the 29th Day of September, 2023 at 10.00 A.M. at the registered office of the company at Plot No: A-40, Road NO:7, IDA, Kukatpally, Hyderabad-500 037, Telangana

Electronic copies of the Notice of AGM and Annual Report are sent to all the shareholders on 06.09.2023 whose email ID's are registered with Company/Depositories in accordance with the SEBI Circular dated May 12, 2020.

In terms of Section 108 of the Companies Act, 2013 and Regulation 44 of SEBI (LODR) Regulations, 2015, the company is providing the facility to cast their vote by electronic means on all the resolutions set forth in the Notice of the AGM through electronic voting system of **KFin Technologies Ltd** (remote e-voting) The facility of casting votes by a member using remote e-voting as well as the e-voting system on the date of the AGM will be provided by **KFin Technologies Ltd**. All the members are informed that:

I) The business as set forth in the Notice of the 39th AGM may be transacted through voting by electronic means.
ii) The remote e-voting shall commence at 26-09-2023 at 10.00 a.m.
iii) The remote e-voting shall end on 28-09-2023 at 5.00 p.m.
iv) The cut-off date for determining the eligibility to vote by electronic means or at the AGM is 22.09.2023. The registrar of members and share transfer books of the company will remain closed from 23.09.2023 to 29.09.2023(both days inclusive).
v) Any person who acquires shares of the company and become member of the Company after dispatch of the notice of the AGM may obtain the login ID and password by sending a request at https://evoting.kfintech.com.
vi) Members who have not casted their vote on the resolutions through remote e-voting are eligible to vote through poll at AGM. The members who have casted their vote by remote e-Voting prior to AGM may also attend the AGM but shall not be entitled to cast the vote again.
vii) Members who have not registered their email address are requested to register their email address with the Depositories/ Company/Registrar and Share transfer agent i.e. **KFin Technologies Ltd.**, to receive copies of Annual report 2022-23 along with notice of 39th Annual General Meeting.
viii) The Notice of AGM and Annual Report is available on the Company's website https://www.deccanpolypacks.com and also on the **KFin Technologies Ltd's** website https://evoting.kfintech.com
ix) In case of queries, members may refer to the Frequently Asked Questions (FAQs) for members and e-voting User Manual for Shareholders available at the downloads section of https://evoting.kfintech.com or contact Mr. DRSP Raju, Director, PLOT NO A-40, ROAD NO 7, IDA KUKATPALLY, HYDERABAD TG 500037, Telangana, Ph. No: 040-23077224, email-deccanploly@gmail.com

For and on behalf of the Board
For Deccan Polypacks Ltd.
Sd/-
D V PRUDVI RAJU
Whole Time Director
(DIN: 03024648)

Place : Hyderabad
Date : 19.09.2023

చింతలపాలెంలో భూకంపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో మళ్లీ భూకంపం సంభవించింది. సోమవారం రాత్రి 9:50 నిమిషాలకు పది సెకండ్లు 2.3 భూకంపం లేఖిని (సిస్మోగ్రాఫ్)పై నమోదైంది. దీంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడి ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. 2020లో ఈ ప్రాంతంలో భూకంపాలు మొదలయ్యాయి. అప్పట్లో ప్రతి రోజూ భూ ప్రకంపనలు వచ్చాయి. మండలంలోని ప్రజలు భూ ప్రకంపనలకు పులిచింతల ప్రాజెక్టు డ్యాం కారణమని భావిస్తున్నారు. ఆనాడు ప్రజలకు పలు సందేహాలు రావడంతో భూ భౌతిక పరిశోధన శాస్త్రవేత్తలు ఈ ప్రాంతంలో పర్యటించి పులిచింతల ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి నిల్వ వల్ల భూ అంతర్భాగంలో పొరలపై భారం పడి ఈ భూకంపాలు సంభవిసున్నాయని తేల్చారు. ఏడాదిన్నరపాటు సుమారు వెయ్యి సార్లు భూకంపాలు వచ్చినట్టుగా భూకంపం లేఖిని (సిస్మోగ్రాఫ్)పై నమోదయ్యాయి. కాగా పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం 30 టిఎంసిల (45.77) నీటి నిల్వ వుంది.

చందానగర్‌లో కంట్రీ చికెన్ కో అవుట్‌లెట్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలోని చందానగర్‌లో కంట్రీ చికెన్ కో ఆవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసింది. దీనిని శేరిలింగల్లి ఎంఎల్‌ఎ అరెకపూడి గాంధీ లాంచనంగా ప్రారంభించారని ఆ సంస్థ తెలిపింది. నాటు కోడి రుచి అమోఘమని గాంధీ అన్నారు. ఈ బ్రాండ్ మరింతగా విస్తరించాలన్నారు. ఇది తమకు 7వ అవుట్‌లెట్ అని సంస్థ వ్యవస్థాపకుడు సాయికేష్ గౌడ్ తెలిపారు. ఒకటిన్నర సంవత్సరాల పాటు సాగిన విశేషమైన ప్రయాణంలో 'కంట్రీ చికెన్ కో' నగరంలో ఓ సంచలనం అన్నారు.

కాంగ్రెస్ ప్రజా విశ్వాసాన్ని కోల్పోయింది

- మతచిచ్చురేపి లబ్ధిపొందాలని చూస్తోంది : డికె అరుణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ అన్నారు. ఆ పార్టీ దేశవ్యాప్తంగా మతచిచ్చు రేపి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నదని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ మారబోరనీ, కుంభకోణాలు చేయబోమనీ, తెలంగాణ చరిత్రను వక్రీకరించబోమనే మూడు కీలకమైన హామీలను ప్రజలకు ఇవ్వాలని కాంగ్రెస్‌పార్టీని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ సహా ఇతర నాయకులు తెలంగాణకు ఆరు గ్యారెంటీలు అంటూ ప్రకటించడం తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేయడమేనని విమర్శించారు. కర్నాటకలో రూ.నాలుగు వేల పింఛన్ ఎందుకివ్వట్లేదని ప్రశ్నించారు. రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. యుపిఎ పాలనలో ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో భారత్ 11వ స్థానంలో ఉంటే.. మోడీ కృషితో ఇప్పుడు ఐదో స్థానానికి ఎగబాకిందన్నారు. భారత ఖ్యాతి విశ్వవ్యాప్తమవుతుంటే కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి, జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీక, రాష్ట్ర అధికార ప్రతినిధులు విఠల్, రాకేష్ రెడ్డి, సంగప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజ్యవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు సునీత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిఆర్‌ఎస్‌కు 98 రోజులే మిగిలాయి

- కారు, కమలం, కైట్ ముసుగు తొలగిపోయింది
- భారతమాత గురించి మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేదు
- మెరుగైన ధరణిని తెస్తాం
- సిడబ్ల్యుసి సమావేశాలను జయప్రదం చేసిన నేతలకు ధన్యవాదాలు
- టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ పాలనకు ఇంకా 98రోజులే మిగిలి ఉన్నాయని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ విజయభేరి సభ జయప్రదం కావడాన్ని బిఆర్‌ఎస్ నేతలు తట్టులేకపోతున్నారని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను నెరవేర్చారని తెలిపారు. తెలంగాణ తల్లి సోనియమ్మను స్వాగతించాల్సింది పోయి... బిఆర్‌ఎస్ నేతలు విమర్శించడం సిగ్గుచేటన్నారు. వారు రాజకీయ విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహురూపు వేషాలు వేస్తూ విజయభేరి సభను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రానికి రావడంతో బిఆర్‌ఎస్, బిజెపి, ఎంఐఎం పార్టీల ముసుగులు తొలగిపోయాయని, కారు, కమలం, కైట్ వేర్వేరు కాదని, అవి ఒక్కటేనని తెలిపోయిందన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మాజీ ఎంపిలు మధుయాష్కీగౌడ్, అంజన్‌కుమార్‌యాదవ్, మల్లు రవి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మాజీ ఎమ్మెల్యే నందికంటి శ్రీధర్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనేవి తెలంగాణ ప్రజల నినాదాలు కాదనీ, అవి కెసిఆర్ నినాదాలని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు కోరుకున్నది స్వేచ్ఛ, ఆత్మ గౌరవమని వివరించారు. సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ చింతకు ఉరేసుకొని సచ్చినా ధరణి రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ధరణి కెసిఆర్ కుటుంబానికి ఏటీఎంలాగా మారిందన్నారు. రాష్ట్రంలో భూసమస్య ప్రధానమైందన్నారు. భూమి కోసమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. దేశం గురించి బిజెపికేం తెలుసని ప్రశ్నించారు. మత విద్వేషాలతో రాజకీయాలు చేసే బీజేపీకి భరతమాత గురించి మాట్లాడే నైతిక అర్హత ఉందా? అని ప్రశ్నించారు. ఉద్యమకారులకు భూమి ఇవ్వడమంటే వారిని గుర్తించి గౌరవించడమేనన్నారు. బండి సంజయ్, రాజ్‌గోపాల్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి లేవనెత్తిన అంశాలపై బీజేపీ అధ్యక్షులు కిషన్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తన స్వప్నమని ఆదివారం సభలో సోనియా చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ గ్యారంటీలతో బీఆర్‌ఎస్ నేతలు కకావికలమవుతున్నారని ఎద్దేవా చేశారు. మేం ప్రజలకు ఏం చేస్తామో చెబుతూ వారివద్దకు వెళతామన్నారు. గతంలో ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ నెరవేర్చిందన్నారు. ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, అర్హులకు పోడు భూముల పట్టాలు, ఆరోగ్యశ్రీ పథకాలు అమలు చేసి చూపించామని గుర్తు చేశారు. 'నల్లధనం తెస్తామనీ, ఉద్యోగాలు ఇస్తామని మోడీ మోసం చేశారు. దళిత సిఎం, దళితులకు మూడెకరాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అంటూ కెసిఆర్ మోసం చేశారు. . 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ ఇచ్చిన హామీలపై చర్చ పెట్టండి. ఎవరు మాట తప్పారో? ఎవరు అమలు చేశారో? తెలుస్తుంది' అని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం, ప్రజల అవసరాలకనుగుణంగానే తమ పార్టీ కార్యాచరణ ఉంటుందన్నారు. కాంగ్రెస్ వస్తే జాతీయ స్థాయిలో నిర్ణయాలు తీసుకోవాలంటూ మంత్రి హరీశ్‌రావు మొండి వాదనలు చేస్తున్నారని విమర్శించారు. సీడబ్ల్యూసీ సమావేశాలను విజయవంతం చేసిన జాతీయ, రాష్ట్ర నాయకులకు రేవంత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రజాకార్ సినిమాను నిషేధించాలి

- అవాస్తవాల చిత్రీకరణ
- మత విద్వేషాలకు బిజెపి ఆజ్యం : జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి నాయకుల సారథ్యంలో విడుదల కాబోతున్న 'రజాకార్' సినిమాను నిషేధించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బిజెపి నేతలు కులం, మతం రంగు పూస్తున్నారని విమర్శించారు. అది వర్గ పోరు మాత్రమేనని, పేదలు, భూస్వాముల మధ్య జరిగిన పోరాటమని తెలిపారు.

పేదల పక్షాన అన్ని వర్గాల ప్రజలు వీరోచితంగా పోరాడి ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. దానిని మతాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. వాస్తవాలను పక్కనపెట్టి అవాస్తవాలతో చిత్రీకరించి ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సమయంలో ఇలాంటి సినిమాలు విడుదల కావడం వల్ల ప్రజల్లో విభేదాలు వస్తాయని వెంటనే ఆ సినిమాను సెన్సార్ బోర్డు నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆనాటి పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్ నైజాం నవాబుకు అనుకూలంగా వ్యవహరించిం దని, స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వాళ్లకు సహకరించిందని చెప్పారు. తెలంగాణలో ప్రజలందరూ సామ రస్యంగా జీవిస్తున్నారని, ఇలాంటి ప్రజల మధ్య మత విద్వేషాలు సృష్టించి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారని విమర్శించారు. విభేదాలు సృష్టించే సినిమాలను సెన్సార్ బోర్డు నిషేధించాలని కోరారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టడం శుభపరిణామమని, సాకులు చూపి బిల్లు అమలు కాకుండా చూసినా, ఆటంకాలు కల్పించినా ఊరుకోబోమన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే మహిళా బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపులు లేకుండా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర యూనిట్‌గా దామాషా పద్ధతిలో ఎన్నికలు జరిపి పార్టీలకు వచ్చిన ఓట్ల ఆధారంగా సీట్లను కేటాయించాలన్నారు. దీనివల్ల ఎన్నికల వ్యయం పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మూడవత్ రవి నాయక్, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి రాగిరెడ్డి మంగారెడ్డి, నాయకులు కందుకూరి రమేష్, లక్ష్మీనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

11వ వేతన ఒప్పందాన్ని అడ్డుకుంటే సమ్మె తప్పదు

- దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో 72 గంటల సమ్మె : తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమలైన 11వ వేతన ఒప్పందాన్ని అడ్డుకుంటే దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో 72 గంటల సమ్మె తప్పదని సిఐటియు అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జిడికె 11వ గనిలో మంగళవారం ఫిట్ సెక్రెటరీ అన్నం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల కక్షతోనే డిపిఇ నిబంధనలను రూపొందించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాని ఆధారంగానే అధికారుల సంఘం కోర్టుకు వెళ్లిందన్నారు. బొగ్గు గని కార్మికుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వేతన ఒప్పందంపై వెంటనే ఈ పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరిపి వేతనాల చిచ్చుకు కారణమైన డిపిఇ నిబంధనలను ఎత్తేయాలన్నారు. లేదంటే అక్టోబర్ 5, 6, 7, తేదీల్లో దేశవ్యాప్త సమ్మె చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రాలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వ కోల్‌బెల్ట్ ప్రజాప్రతినిధులు సొంతింటి కలపై కార్మిక సమస్యలపై శాసనసభలో మాట్లాడకుండా తమ గొప్పలు చెప్పుకున్నారని విమర్శించారు. కార్మికుల వేతనాలపై అధికారులు కోర్టుకు వెళ్లిన విషయంపై, కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి బొగ్గు దిగుమతిని తప్పనిసరి చేసిన ఆదేశాలను వెనక్కి తీసుకునేలా పార్లమెంటులో లేవనెత్తా లని డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం జరిగిన సమావేశంలో డైరెక్టర్ అన్ని యూనియన్లను సమానంగా గుర్తిస్తూ సర్క్యులర్ జారీ చేయకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఆర్జీ-1 కార్యదర్శి మెండె శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి జెల్లా గజేంద్ర, ఉపాధ్యక్షుడు అసరీ మహేష్, ఆరేపల్లి రాజమౌళి, బొద్దుల రఘువరన్, అన్నం శ్రీనివాస్, బొగ్గరం శ్రీనివాసరావు, ఇప్పలపల్లి సతీష్ కుమార్, సిహెచ్ దేవేంద్ర, జె మల్లేష్, యం రామన్న, గాండ్ల రమేష్, జె సత్యనారాయణరావు, మహేందర్, రవితేజ, కార్మికులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనార్టీలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి : ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చట్టసభల్లో మహిళలకు కల్పించిన 33 శాతం రిజర్వేషన్లలో ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన మహిళా బిల్లును స్వాగతిస్తున్నట్టు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో లబ్ధిపొందడం కోసమే బిజెపి 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టిందన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన 50 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత ఐఎఎస్ అధికారి జి.కృష్ణయ్యను హత్య చేసిన ఆనంద్ మోహన్ శిక్షను తగ్గించి జైలు నుంచి ఎందుకు విడుదల చేశారో ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఇండియా కూటమిలో ఉన్న బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇడి కేసులను తప్పించుకోవడం కోసమే కవిత మహిళా బిల్లు కోసం ధర్నా చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు పథకాలు అమలుకు ఆచరణ సాధ్యం కావని విమర్శించారు.

రాష్ట్రంపై మరోసారి విషం చిమ్మిన మోడీ

- కెసిఆర్ పోరాట ఫలితమే రాష్ట్రం ఏర్పాటు : గుత్తా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మోడీ మనసు నిండా విషం ఉంది. పార్లమెంట్ సాక్షిగా సోమవారం ప్రధాన మంత్రి మోడీ పచ్చి అబద్ధాలు మాట్లాడారు. తెలంగాణపై మరోసారి విషం చిమ్మారు' అని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావుతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎక్కడ రక్తం ఏరులై పారిందో ప్రధానమంత్రి చూపించాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో రక్తపుటేరులు పారిన ఘటనలు ఇంకా మోడీ మరువనట్టు ఉందని, అవి గుర్తొచ్చి మాట్లాడుతున్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. వాజ్‌పెయి హయాంలో జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను ఏర్పాటు చేసి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఎందుకు ప్రకటించలేదో చెప్పాలని ప్రశ్నించారు. బిజెపి చేసిన అన్యాయాలు, అక్రమాలు చాలా ఉన్నాయని, కేసీఆర్ అలుపెరుగని పోరాట ఫలితంగానే కేంద్రం దిగొచ్చి రాష్ట్రాన్ని ఇచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టేలా హామీలు ఇస్తున్నదని ఆరోపించారు. ఆ పార్టీ అనౌన్స్ చేసిన ఆరు గ్యారంటీ హామీలు ఉత్తివేనని, ఆచరణకు సాధ్యం కాని హామీలను కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తుందని విమర్శించారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం ఏదో చెప్పాలన్నారు. కాంగ్రెస్, బిజెపి కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. తెలంగాణ కోసం రాజీనామా చేయాలంటే పారిపోయిన వ్యక్తి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అని విమర్శించారు. యెండల లక్ష్మీనారాయణ రాజీనామా చేస్తే కిషన్ రెడ్డి చేయలేదని గుర్తు చేశారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం బిజెపి పనని, ఆ పార్టీ పతనం ప్రారంభమైందని, అందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు అంటూ హడావుడి చేస్తోందని విమర్శించారు.

ఇళ్ల సమాచారం అడిగిన వారిపై డిసి దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'డబుల్ బెడ్‌రూం ఇండ్లా.. ఎక్కడ. మూసుకొని దొబ్బేయండీ. ఎవడిస్తున్నాడు.. ఎవడు డ్రా తీస్తున్నాడో వాడినే అడుక్కోండీ..' అంటూ డిసి దురుసుగా ప్రవర్తించారు. హైదరాబాద్ ఉప్పల్ జిహెచ్‌ఎంసి కార్యాలయంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమాచారం అడిగిన కొందరు మహిళలతో ఉప్పల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ (డిసి) అన్న వ్యాఖ్యలివి. వివరాల్లోకెళ్తే..

డబుల్ బెడ్‌రూం ఇళ్ల వివరాల కోసం వందల సంఖ్యలో మహిళలు మంగళవారం ఉప్పల్ జిహెచ్‌ఎంసి కార్యాలయానికి వచ్చారు. ఉప్పల్, చిలుకానగర్, హబ్సిగూడా, రామంతాపూర్ సర్కిల్‌తోపాటు వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఉదయమే కార్యాలయానికి వచ్చారు. గంటల తరబడి వేచిచూశారు. తమకు ఇండ్లు రాలేదని కొందరు, డ్రాలో పేరు లేదని, ఇంకొందరు స్థానికంగా వార్డు కార్యాలయాల్లో ఎలాంటి వివరాలూ చెప్పడం లేదని, ఉప్పల్ జీహెచ్‌ఎంసీ సర్కిల్-2 కార్యాలయంలో తెలుసుకోవాలంటూ చెప్పారని తెలిపారు. మరికొందరు లిస్టులో తమ పేర్లు ఉన్నా పూర్తి సమాచారం తెలియడం లేదని చెప్పారు. వివరాల కోసం ఆరా తీశారు. అయినా డబుల్‌బెడ్ రూం ఇండ్ల వివరాలకు సంబంధించి ఎలాంటి సమాచారమూ లభించలేదు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఉప్పల్ డిసి కార్యాలయానికి వచ్చారు. ఇది గమనించిన మహిళలు ఆయనతో మాట్లాడేందుకు గదిలోకి వెళ్లారు. 'మాకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు రాలేదు సార్..' అని అడిగారు. దాంతో ఆగ్రహంలో ఊగిపోయిన డిసి 'ఇక్కడికి ఎందుకొచ్చారు.. మూసుకొని వెళ్లిపోండి.. ఎవడిస్తున్నాడో.. ఎవడు డ్రా తీస్తున్నాడో వాడినే అడుక్కోండీ' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో కంగుతిన్న మహిళలు అవేమి మాటలు సార్.. మహిళలతో ఇలా మాట్లాడుతావా అంటూ నిలదీశారు. ఈలోగా ఇతర అధికారులు, సిబ్బంది వచ్చి మహిళలకు నచ్చజెప్పారు. గ్రేటర్ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్దిదారుల ఎంపికలో పారదర్శకత లేదని, అర్హులకు కాకుండా అనర్హులకే ఇండ్లు కేటాయిస్తున్నారని బాధిత మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు మూడు నెలల నుంచి తిరిగిపోతున్నా ఎలాంటి సమాచారమూ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి లిస్టు, రెండో లిస్టును జిహెచ్‌ఎంసి కార్యాలయంలో ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినా ఎందుకు బయట పెట్టడం లేదని, అంత గోప్యత ఎందుకని ప్రశ్నించారు. సమాచారం అడిగితే మహిళలని చూడకుండా అధికారులు దురుసుగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటి పట్టాలు రాకపోవడంతో జివిఎంసికి వచ్చిన పేదలు

ప్రభుత్వ పాఠశాలలకు రూ.2 కోట్ల సాయం

- రౌండ్ టేబుల్ ఇండియా చొరవ
- విఎస్‌టి ఇండస్ట్రీస్ సహకారం

హైదరాబాద్ : సామాజిక సేవా దృక్పథంతో రౌండ్ టేబుల్ ఇండియా స్థానిక విభాగం హైదరాబాద్ టైటాన్స్ రౌండ్ టేబుల్ ఛారిటబుల్ ట్రస్ట్ నగరంలోని విఎస్‌టి ఇండస్ట్రీస్‌తో కలిసి పలు ప్రభుత్వ పాఠశాలలకు భారీ సాయం చేశాయి. హైదరాబాద్ నగర శివార్లలో ఉన్న తూప్రాన్, బ్రహ్మణపల్లిలోని పాఠశాలలకు రూ.రెండు కోట్ల వ్యయంతో కొత్త తరగతి గదులు, టాయిలెట్ బ్లాక్‌లు, ఇతర అధునాతన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. మొత్తంగా నాలుగు పాఠశాలల్లో పది తరగతి గదులు, మూడు టాయిలెట్ బ్లాకులను నిర్మించారు. తూప్రాన్‌లోని జడ్‌పిహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో 3 తరగతి గదులు, అక్కడి బాలికల ఉన్నత పాఠశాలలో టాయిలెట్లు, బ్రహ్మణపల్లిలో ని ఎంపిపిఎస్ స్కూల్‌లో టాయిలెట్ బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్‌నూ చేపట్టారు. ఈ పాఠశాలలకు 60 స్కూల్ బెంచీలూ వితరణ చేశారు. ఇందుకు విఎస్‌టి ఇండస్ట్రీస్ రూ.2 కోట్ల సాయం చేసింది. ఈ కార్యక్రమాల్లో విఎస్‌టి ఇండస్ట్రీస్ ఎండి ఆదిత్య దేబ్ గుప్తు, సిఎఫ్‌ఓ అనీష్ గుప్తా, హెచ్‌ఆర్ చీఫ్ అమిత్ అరోరా, రౌండ్ టేబుల్ ఇండియా ప్రతినిధులు కృష్ణ సుధీర్ డోగిపర్తి, విక్రాంత్ హనుమంతు, అంకిత్ సేథి పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

నకిలీ డాక్యుమెంట్స్, స్టాంపులు తయారీ ముఠా అరెస్ట్

- ప్రభుత్వ బ్యాంకులే లక్ష్యంగా మోసాలు
- సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ డాక్యుమెంట్స్, ప్రభుత్వ ఆఫీసర్ల స్టాంప్స్, ఇతర గ్రామపంచాయతీ లే అవుట్ కాపీలు తయారీ చేస్తున్న ముఠాను సైబరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి, వీరి నుంచి పెద్ద మొత్తంలో డాక్యుమెంట్స్, స్టాంప్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ కమిషనరేట్‌లో సిపి స్టీఫెన్ రవీంద్ర మీడియాకు వెల్లడించారు. కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి పరిధిలో ఆరుగురు ఒక ముఠాగా ఏర్పడి ప్రభుత్వ అధికారుల స్టాంపులను, నకిలీ డాక్యుమెంట్లను తయారు చేస్తున్నారు. ప్రధానంగా జిహెచ్‌ఎంసి ఇంటి పర్మిషన్, ట్రేడ్ లైసెన్స్, జిహెచ్‌ఎంసి పరిధిలోని అన్ని విభాగాలకు సంబంధించిన నకిలీ డాక్యుమెంట్స్, గ్రామపంచాయతీ లే అవుట్ కాపీలు, హెచ్‌ఎండిఎ నాలా కన్వర్షన్ సర్టిఫికెట్లు, బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లతో పాటు నకిలీ హౌస్ హోల్డర్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నారు. వీటి ద్వారా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇతర ప్రభుత్వ జాతీయ బ్యాంకుల్లో లోన్లు తీసుకుంటున్నారు. హౌసింగ్ లోన్ తీసుకునే సమయంలో అధికారులు వెరిఫికేషన్‌ను నిర్లక్ష్యంగా చేయడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని సిపి వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు నిర్లక్ష్యంగా జరిగాయా లేదా ఉద్దేశపూర్వకంగా జరిగాయా? వీటి వెనుక ఎవరు ఉన్నారనే అంశంపై దర్యాప్తు వేగవంతం చేసి, త్వరలోనే వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. నిందితుల నుంచి 687 నకిలీ రబ్బర్ స్టాంపులు, వివిధ డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన ఫేక్ సర్టిఫికెట్స్, 1180 డాక్యుమెంట్లు, పది లాప్‌టాప్స్ సిపియులు, ఎనిమిది మానిటర్స్, రెండు ప్రింటర్స్, స్టాంప్ తయారు చేసే ఒక మిషన్, 57 మొబైల్ ఫోన్స్, టూవీలర్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. పది కోట్ల వరకు ఉంటుందని సిపి వివరించారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

భూ నిర్వాసితులను బెదిరించి.. ఖాతాలో నగదు జమ చేయడం సరికాదు

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగపూర్ - అమరావతి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలని, వెంటనే జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ రైతులతో చర్చించి ధర నిర్ణయించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, నిర్వాసితుల ఉద్యమ కన్వీనర్ తకెళ్ళపాటి భద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం తూటికుంట్ల గ్రామంలో మంగళవారం నాగపూర్ - అమరావతి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి భూ నిర్వాసితులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు రైతులతో చర్చలు జరిపి రైతులను సానుకూలంగా ఒప్పించాలే గానీ రైతులను బలవంతం చేయడం, కోర్టులో డబ్బులు డిపాజిట్ చేస్తామని, కోర్టులో నుంచి డబ్బులు తీసుకోవడం బహు కష్టం అని బెదిరించి ఎకౌంట్ పాస్ పుస్తకాలు నకళలు వసూలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కలెక్టర్ ధర నిర్ణయం చేయాల్సి ఉంటుందని, అలా కాకుండా గ్రామానికొక ధర చెప్పి రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. భూ నిర్వాసితులు ధర నిర్ణయం జరిగే వరకు, ఇతర సమస్యలు పరిష్కారంపై హామీ ఇచ్చే వరకు ఐక్యంగా భూ నిర్వాసిత రైతులు ఉద్యమం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం మండల కార్యదర్శి తూళ్ళూరి రమేష్, సిపిఎం మధిర పట్టణ మాజీ కార్యదర్శి పాపినేని రామనర్సయ్య, భూ నిర్వాసిత రైతులు నాగండ్ల శ్రీధర్, మందడుపు రవీంద్ర, సాధినేని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

బిజెపిని గద్దెదించడమే ప్రధాన లక్ష్యం

- అక్టోబర్ 5న 'చలో ఢిల్లీ' విజయవంతం చేయాలి
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'బిజెపిని గద్దె దించండి - మహిళలను, దేశాన్నీ రక్షించండి' నినాదంతో అక్టోబరు 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశంలో అతిపెద్ద మహిళా సంఘంగా ఉన్న ఐద్వా మహిళల సమాన హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు దాటినా మహిళలపై హింస, లైంగిక దాడులు పెరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులపై దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా హక్కుల పరిరక్షణకు ఐద్వా పోరాడుతోందని తెలిపారు. కోటి సభ్యత్వంతో 26 రాష్ట్రాలకు విస్తరించిన ఐద్వా.. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల్లోకి చొచ్చుకుపోయి పని చేస్తోందన్నారు. 1981లో ఆవిర్భవించినప్పటి నుంచి స్త్రీల ఆహార, ఉపాధి, విద్య, వైద్య హక్కుల కోసం పోరాడుతోందని తెలిపారు. 2014లో బిజెపి అధికార పగ్గాలు చేపట్టాక మహిళల స్వేచ్ఛా స్వతంత్రాలపై, బతుకు దెరువుపై మునుపెన్నడూ లేని రీతిలో దాడులు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న రాజ్యాంగ హక్కులను కాలరాసేందుకు సైతం కేంద్రం తెగబడుతోందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలను తిప్పికొట్టే దిశగా రానున్న 2024 ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించటమే లక్ష్యంగా ఐద్వా పనిచేస్తోందని స్పష్టంచేశారు. తెలంగాణలో మూడు లక్షల సభ్యత్వం కలిగిన ఐద్వా నిరంతరం స్త్రీల సమస్యలపై ఉద్యమిస్తోందన్నారు. అక్టోబరు 5న జరపబోయే ప్రదర్శనను జయప్రదం చేసేందుకు జిల్లాల్లో సెమినార్లు, పది రోజులపాటు జీపు జాతాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఢిల్లీ ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నలిగంటి రత్నమాల, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి సంగం ప్రీతి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సొప్పదండి స్వర్ణలత, జిల్లా ఉపాధ్యక్షులు ముక్కెర శ్రీలత, జిల్లా కమిటీ సభ్యులు దాట్ల రజిత, ఉషారాణి, మంద కోమల, బందు సుజాత, మండల ఉపాధ్యక్షులు పులి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.